# కడుపుశోకం

● శ్రీ తోట లక్ష్మయ్య

★

పుట్టనూపోనూ, పుట్టనూపోనూ. ఈ విధంగా ఏడెనిమిది కాన్పులు పోయాయి. గుమ్మడిపండ్లంటివాళ్లు. మేలిమి బంగారానికైనా వన్నెపెట్టచ్చుగాని, ఆ అర్ధాయుసు బిడ్డలకు మాత్రం పేరుపెట్టేవాళ్లు లేరు. ఎవర్ని మరుద్దామన్నా మరవచ్చుగాని, ఆ బిడ్డలు, ఆ బంగారబిడ్డలు, ఆవజ్రాల కొండల్నిమటుకు మరచి ఏతల్లీ జీవించలేదు. ముచ్చటగా మూడు నాలుగేండ్లుపెరగటం, వారి ఋణంవారు తీర్చుకోవటం, చక్కాతిర్గి వారిదార్ని వారు పోవటం. ఈలాంటి పుత్రశోకాన్ని భరించటానికి కాబోలు ఆ భగవంతుడీ జానికమ్మ నీలా సృష్టించాడు. ఈ సంసారాన్ని తలచుకునేటప్పటికి ఆమె గుండెలు గుభీలుమనేవి. మనస్సు వ్యాకులత చెందేది. కడుపులో తాటాకుల మంటపెట్టినట్లుండేది.

ఆలాంటి పరిస్థితుల్లో జానికమ్మకు దిక్కు, తోవ తోచలేదు. ఈ ప్రపంచమంటేనే అసహ్యమేసింది. ఆమెకంతా అంధకార బంధురంగానే కనపడ్డది. బిడ్డలుకోసమని ఆ తల్లిపడ్డకష్టాలు కష్టాలుకావు. తాయిత్తులు చేయించుకొనేది. విభూతి పెట్టించుకొనేది. ముక్కుమొఖంవుండే రాళ్లన్నటికీ మ్రొక్కేది. ఉపవాసాలుండేది. వ్రతాలుచేసేది. నానాటికి కృశించిపోయింది. ఈ కష్టాలన్నీ దేనికి? ఆ కాయలకోసం.

పేరయ్యకు యాభయ్యోవ్యాపరవిడి దాటింది. మహాబీదకుడు. రెక్కలున్నంతవఱకూ వాటి నమ్ముకొని బ్రతికేవాడు. పెద్దతనంలో యీ కష్టాలు, కష్టాలకుతగినట్లు కళ్లు కనపడకపోవటం, వెనకాముందూ బంధువులెవరూ లేకపోవటం, ఆస్తులుపాస్తులు శూన్యంకావటం ఇవన్నీ వక్కసారేకలిసి వచ్చాయి. తాను పోవాలి, బీడ పావలో సంపాయించాలి. పొయ్యిమీద కుండెక్కాలి. అంతలో భగవంతుడి దయవల్ల జానికమ్మ గర్భం దాల్చింది. కడుపు పండిందనుకొంది. కష్టాలు తీరాయనుకుంది. కాని, భగవంతుడు మటుకుచూచి ఓర్వస్తాడు! ఆమె కడుపున ఈబిడ్డపడటం. భర్తకు వల్లువాపుచూపటం. తింటానికి లేకపోవటం. ముసలితనంలో యిన్ని కష్టాలురావటం. ఈ దిగుళ్లతో మనిషి సగం క్రుంగిపోవటం. ఆమెకు ఏడో మాసంవచ్చింది. చిత్తస్వాతులు ప్రవేశించటంతోటే ఆ వృద్ధుడు, ఆ జానకమ్మపెనిమిటి, జీవాల్ని విడవలేక, విడవలేక, విడవాల సొచ్చిందిగదాయని విడిచేసి, ఆతల్లి నీ లోకంలో ఏకాకినిచేసి పోయాడు.

మందభాగ్యురాలు జానికమ్మ ఏం చేస్తుంది? ఎటుచూచినా నిరామయం. తింటాకిని తిండీలేదు, కట్టటానికి బట్టాలేదు, ఉంటానికి తావూలేదు. తాకట్టుదారుడొచ్చి ఇల్లు ఖాళీచేయమన్నాడు. నిండు గర్భం. ఏమీ పాలుపోలేదు. ముందునుయ్యి, వెనుకగొయ్యి. మానం కాపాడుకోవటానికిమటుకు పదిపణ్ణెండు మూళ్ల చినిగినకోకొకటి చుట్టుకొని, చిరకాలంనుంచి తన భర్తతో కాపురంవున్న ఆ గృహాన్ని విడవవల సొచ్చిందిగదా భగవంతుడా అని దుఃఖించి, ఒకరోజున, వేకువ జామునే లోకులకళ్లల్లో పడకుండా బయలుదేరి, పొద్దు కొండలో పడేటప్పటికో పల్లె చేరుకుంది.

♦ ♦ ♦ ♦

అదో చిన్నపల్లె. ఆపల్లెలో ఆసామీల బజారు చేరింది. అంతవఱకుకూడ పొరిగింటిలో, కూటికిగాను పరిచర్య చేయనటువంటి ఆ యిల్లాలు ఒక ఆసామింట్లో కుదిరింది. ఆయన, కొట్టంలో ఓగది

చూపాడు. దాంట్లోనే ఆమెవుంది. నవమాసాలు నిండాయి. నడవలేదు. ఇరుగు పొరిగిండ్లనుపొయ్యి అడుక్కోలేదు. ఆమెను చూచినవారంతాకూడా చాలా విచారపడ్డారు. ఈ దిక్కులేనివాళ్ల కీకడుపు లెందుకని కొందరన్నారు. ప్రతివాళ్లు ఏదో తమకుదోచిన సహాయం వాళ్లుచేసారు. పదోమాసం సగంతరానికి, కష్టాల కిష్టయ్య, కష్టాలేంపెట్టకుండానే భూమిమీదపడ్డాడు. పండుకుంటానికో నుక్కిమంచం, బిడ్డనెత్తికి ఆముదం, పక్కకు పాత్తిగుడ్డలు, బాలింతరాలికో పాత చెప్పులజోడు అయమ్మా ఈయమ్మా యిచ్చారు. ఆ కాపు కూతురు చిన్నపిల్ల, సుబ్బమ్మమటుకు కిష్టయ్యదగ్గర్నే ఎప్పుడూ వుంటూవుండేది.

మూడేళ్లు ఈవిధంగా గడిచాయి. ఆబిడ్డను చూచుకుంటూవుంటే భర్త పొయ్యాడనే దిగులామెకు కొంచెం కొంచెంగా తగ్గుతుండేది. కిట్టడుగూడా తల్లి కూర్చుంటే, మంచినీళ్లు తీసుకొచ్చేంత మొనగాడయ్యాడు. కిట్టడేవిధంగా రోజూరోజూ పెరుగుతూన్నాడో, ఆమెదిగులు రోజుకు రోజుకు ఆ విధంగా తగ్గుతుండేది. కొడుక్కి చదువు చెప్పించాలని తల్లికి మహాప్రేమ. అయిదో ఏడురాగానే అక్షరాలుదిద్దబెట్టింది. వీధిబళ్లోవేయించింది. అల్లరిగిల్లరి చేయకుండా చదువుకుంటూవుండేవాడు. నాలుగోతరగతికూడా ప్యాసయ్యాడు. తర్వాత ఆవూరి కైదారుమైళ్ల దూరంలో ఓ హైస్కూలువుంటే అందులోచేరాడు. వాళ్ళ వీళ్లనడిగి వారాల గుదుర్చుకున్నాడు. బళ్లో పిల్లకాయలచేత, తననోటి మంచితనంచేత, చందా లేయించుకొని, జీతాలుగడిపి, మెల్లిగా స్కూలుఫైనలుగూడా ప్యాసయ్యాడు. ఆస్కూలు హెడ్మాష్టరుగూడ కృష్ణమూర్తి అంటే దయగల్గి, జాలేసి, గవర్నమెంటు స్కాలరుషిప్పుగూడా తెప్పించాడు.

ఇంతలో జానికమ్మవున్న కొట్టంలోనుంచి, యింకోచోటికి పోవాలసొచ్చింది. ఆ ఆసామే, వేరే ఒకచోట స్థలం చూపించాడు. వాళ్లువీళ్లు బొంగులు, తాటాకు సప్లయిచేస్తే, ఓచిన్న గుడిసెవేసుకుంది. ఏలాగో ఒక పాతికరూపాయలువెనకేసింది. దానితో ఒక బర్రెనుకొని పాడిచేసి, పాలు, పెరుగు, నెయ్యి, అమ్మకొని, ఇరుగు పొరుగాళ్లకి చాకిరిచేసి, నలభైయాభై రూపాయలువెనకేసింది.

ఇక కృష్ణమూర్తి కాలేజీకిపోవాలి. పోవటానికి సిద్ధమయ్యాడుకూడా. జానికమ్మనుమటుకు, దుఃఖము సంతోషం, ఒకేసారి కప్పేసాయి. ఇంక నాలుగు సంవత్సరాలదాక, కొడుకును చూచుకోను కావాలనని దుఃఖము. భర్తపోయినా, కాపురంవున్నయిల్లు పోయినా, అక్కడ చేసికొని, ఇక్కడ చేసికొని, కొడుక్కి చదువు చెప్పించినందుకుగాను, కాలేజీకి పోగలిగినాడే అనేటటువంటి సంతోషం. ప్రయాణమయ్యాడు, దాచిపెట్టిన డబ్బుకాస్తా మూటకట్టి జాగ్రత్త అని చెప్పింది. ఆ కాలేజీమటుకు దగ్గరా దాపా? ఇరవై ఆమడ. అంతవఱకు తల్లి కొడుకుని చూడనటువంటి రోజులేదు. ఇంక ఈ నాలుగు యుగాలు గడపటం ఏలా అనుకునే టప్పటికి, తెలియకుండానే, కళ్ళనుంచి బొటబొటరాలినయి. సిద్ధమయ్యాడు. పోబోతున్నాడు. సాగనంపటానికి బయలుదేరింది. కళ్లనిండా నీళ్లు కమ్మినయి. 'నాయనా, ఇంక ఎన్నాళ్లకో కదా!'అని అన్నది. అయిదారడుగు తీశాడు. మళ్లా 'నాయనా' అని పిలిచింది. ఆగాడు, దగ్గఱకు పోయింది. ముద్దెట్టుకుంది. గోళ్ళతో తలదువ్వింది. పంపించటానికి చేతులురాలేదు. ఇద్దఱూ ఊరుదాటి ఒచ్చారు, ఎవ్వరూలేదు. ఆకాశంలో ఆతండ్రి, క్రింద ఈ కొడుకూతప్ప. 'ఇక పోయిరానాయనా'అంది. పది పణ్ణండడుగులేశాడు. తాను గబగబావెంటనే పోయింది. నడక సాగలేదు. ఎంతదూరంపోయినా, కలుసుకోలేననుకుంది. తిరిగి 'నాయనా'అని పెద్ద కేకేసింది. మూర్తి తిరిగొచ్చాడు. తల్లిని కౌగలించుకున్నాడు. ఆ ముఖంలో తల్లి భర్తనుచూచింది. వెనుకటి కష్టాలన్నీ జ్ఞాప్తికొచ్చాయి. ఆపుకోలేకపోయాడు.

తనకు తెలియకుండానే తానూ ఏడ్చాడు. అంతవఱకు, కాలేజీకిపోతామనే సంతోషమేగాని, తల్లిని ఒదిలి పెడతన్నామనే విచారం లేనటువంటివాడు. జానికమ్మ గుండెనిబ్బరం చేసుకుంది. 'పోయిరా-నాయనా' అని చెప్పాలని నిశ్చయించుకొన్నది. చెప్పటానికి ప్రయత్నించింది. చెప్పక తప్పిందిగాదు. చెప్పింది. తల్లిని మళ్లా కౌగిలించుకున్నాడు. ఆఖరుసారి 'వెళ్తానే' అన్నాడు. వెళ్లాడు. నిలుచుండి కనపడేంతవఱకూ, తిరిగి చూస్తూవున్న కొడుకుని చూస్తూ నిలుచుంది. చివరకి, డొంకమూల తిరిగింది. కొడుకు కనపడలేదు. ఊరువైపుకు మొఖం దిప్పింది. వెనుకటి సంగతంతా జ్ఞప్తికొచ్చింది. చివరకిల్లుచేరింది. ఆరాత్రి అన్నం దినలేదు. అన్నం తినబోతూవుంటే మూర్తి జ్ఞప్తికొచ్చాడు. పండుకోబోతుంటే జ్ఞప్తికొచ్చాడు. ఆరాత్రి నిద్రే పట్టలేదు. ఈవిధంగా రెండు మూడువారాలు గడిచాయి. రెండుమూడు సంవత్సరాలుగూడా గడిచాయి.

♦ ♦ ♦ ♦

అక్కడ మూర్తి కాలేజీలోచేరాడు. కులాసాగానేవున్నాడు. యఫ్. ఏ. ప్యాసయ్యాడు. బి. ఎ. లో చేరాడు. మూడోసంవత్సరం జరిగింది. నాలుగో సంవత్సరం సగం జరిగింది బి. ఎ. జూనియర్ లోనే ఒక స్నేహితుడితో సహవాసం కుదిరింది. ఆ స్నేహితుడు భాగ్యవంతుడు. ఇద్దఱూకలిసే చదువుకునేవాళ్లు. యూనివర్సిటీ పరీక్షలు, ఇంకో నెల్లో వచ్చినయి. బాగానే చదివారు. పరీక్షకు కూర్చున్నారు. తృప్తికరంగానే రాశారు. చివరకు ఏలాగ ఆలాగ అయిపోయినాయి.

అది ఏప్రల్, 15వ తేది సాయంత్రం. పరీక్షలు అయిపోయినాయి. ఆసాయంత్రమే ఇంటికి టెలిగ్రామిచ్చాడు, మరుసటినాడు సాయంత్రం 10 గంటల బండికి చేరుతానని. సామానంతా సర్దేశాడు. ఒక రోజా, ఒకనెలా, ఒకసంవత్సరమా, నాల్గు సంవత్సరాలు దాదాపు ఎప్పుడు ఇంటికెళ్దామా, ఎప్పుడు తల్లిని చూద్దామా అనివున్నాడు మూర్తి. 'ఈ రాత్రి బయలుదేరుతున్నాన'ని స్నేహితుడితో చెప్పాడు.

'ఎక్కడికి'

'ఇంటికి'

'ఈరాత్రి టాకీచూచుకుని రేపుదయం బయలు దేరచ్చులే'

'కాదు మఅమ్మకు రేపొస్తానని టెలిగ్రామిచ్చాను. ఆమె నాకోసం ఎదురుచూస్తుంటుంది.'

'ఏం మూర్తీ, ఇంకా ముసలివాళ్లమాటల్లోనే, బి. ఏ. జదివి గూడా'

'కాదు, చాలారోజులయింది ఇక్కడకొచ్చి'

'ఎన్ని రోజులవుతుంది'

'నాలుగు సంవత్సరాలు'

'ఇన్ని సంవత్సరాలుండచ్చుగాని, ఈ రోజొక్కటి పట్టుకుంటుంది' అని బలవంతంచేసాడు. మాట తప్పించుకోలేకపోయాడు. మరునాడు మధ్యాహ్నం బయలుదేరుదామనుకొన్నాడు.

♦ ♦ ♦ ♦

తల్లికి టెలిగ్రాముఅందింది. ఆమె ఆనందానికంతులేదు. ఒకసారికి ఏడుసార్లు తృప్తిదీర చదువుకుంది. జాగ్రత్తగా దాచిపెట్టింది. ఇరుగుపొరుగువారికి సంగతిచెప్పింది. పూరికొంప బూజుదుల్పింది. లోపల

# కడుపు శోకం

బయటా బాగా అలికింది. కొడుక్కిష్టమైన పిండివంట ఏదోచేసింది. బి. ఏ. చదివొస్తున్నాడుగదా, కిందెట్లా కూర్చుంటాడని అరువుకు, పాతకుర్చీ తెచ్చేసింది. అంతా తయారుచేసింది. ఆనందంలో మునిగిపోయింది. కూనరాగాలు తీయటం, ప్రారంభంచేసింది. 'ఎప్పుడీ యాళిటప్పుడు, ఇంట్లోవుండదే! రాగాలు గూడా పాడుతుందే' అని దోవనబొయ్యే ముసలివాడొకడొచ్చి తడిక తొయ్యగానే సిగ్గుపడి, అబ్బాయివస్తాడని చెప్పింది. టెలిగ్రాముకూడా చూపించింది. తాను మళ్లాచదువుకుని జాగ్రత్తచేసింది. తర్వాత బయటికొచ్చి కూర్చుంది. పొద్దు కొండలోపడ్డది. 7 అయింది, 8 అయింది, 9 అయింది. అందరు అన్నాలుతిని నిదుర బోయారు. తానుమటుకు తినకుండానే ఎదురుచూస్తూంది. 10 అయింది 10-30 అయింది, కొడుకింకారాలేదు. నడిచిరావాలగదా స్టేషనుదగ్గరనుంచి, ఆలశ్యం అవుతుందిగదా యనుకుంది. కొడుకుని చూడాలని చాలా ఆతురతతోవుంది. పండు పండిందిగదా కష్టాలు దరిబట్టినాయిగదా, అని ఏదో ఏదో అనుకుంది. నిముషము యుగంగావుంది ఆమెకి.

పట్టాలు తొలిగినందున, ఆరోజు 10 గంటలకు రావాలసినబండి పడిపోయింది. పాతికో, ముప్ఫయ్యిమందో మరణించారు. అందులో నలుగురు కాలేజీ విద్యార్థులుగూడా వున్నారట అన్నవార్త స్టేషనుమాష్టరుకు తెలిసింది. స్టేషనంత ఒక్కసారి ఘల్లుమన్నది. ఈ పల్లెటూరివాళ్లు కొందఱక్కడ పనిచేసే వాళ్లు రాత్రి 11 ఆప్రాంతాన ఇల్లుచేరారు. ఊరంత నిశ్శబ్దంగావుంది. అందరు నిద్రపోయారు. ఇంటి ముందు జానికమ్మ ఒక్కటేమటుకు కూరుచుంది. 'ఏం జానికమ్మ, ఈయాలదాక మేలుకున్నావు నిదుర బోకుండా' నన్నారు. ఈ బండికి అబ్బాయివస్తాడు అందుకని ఎదురుచూస్తున్నాను. ఇంకారాలేదు అని అన్నది. పిడుగువంటివార్త, వారామెచెవిని వేయాలసొచ్చింది.

'రైలుపడ్డది. జనంచచ్చారు. కాలేజీపిల్లకాయలు గూడా అందులోవున్నారట' అని అందులో ఒకడుచెప్పాడు. గోడకానుకున్న జానికమ్మ 'ఆ!' అన్నది. కడసారి ఆవలించింది. అంతటితో ఆమెకష్టాలన్ని ఒక్కసారి దరిబట్టాయి.

మూడోరోజు కొడుకు స్టేషనులోదిగి ఊళ్లోకొచ్చాడు. తల్లి ఎదురురాలేదు, ఇంటిముందుకొచ్చాడు తలుపేసివుంది. ఇల్లు తమదేగదా అని పరికించాడు. తమదే. తల్లిలేదు ఇంట్లోనేగాదు, ఈ లోకంలోగూడా అని దగ్గఱ తులశమ్మ చెప్పింది. 'అయ్యో! అమ్మా!' అంటూ అక్కణ్ణే పడ్డాడు.

యం మాతాపితరౌ క్లేశం సహేతే సంభవే నృణాం,
స తస్య నిష్కృతిశ్శక్యా కర్తుం వర్షశతై రపి.

తల్లిదండ్రులు బిడ్డల పుట్టుకకై యెంతకష్టము పడుదురో, ఆకష్టము నూఱేండ్లకయినను దీర్పు కొనవీలు కాదు. తల్లి గర్భమునఁ బదినెలలు మోసి, ప్రసవవేదన ననుభవించి, పుట్టినబిడ్డను పెంచి పెద్దచేయుట, తండ్రి పసితనమున సంరక్షణముచేయుట, యుపనయనముచేయుట, వేదవేదాంగాదులను జెప్పించువిషయమై కష్టముపడుట, వీరియిద్దఱి యీశ్రమ ఎన్నిజన్మములకైనను తీరదు.

—మను స్మృతి.